క్లుప్తంగా

నేటి నుంచి ప్రత్యేక ఆధార్ శిబిరాలు

కపిలేశ్వరపురం: ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గురువారం నుంచి మండల పరిధిలోని గ్రామాల్లో ప్రత్యేక ఆధార్ నమోదు శిబిరాలు నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ కె.రత్నకుమారి బుధవారం తెలిపారు. తొలిరోజు గురువారం కేదారిలంక, టేకి, వడ్లమూరు, 23న పడమర ఖండ్రిక, వాకతిప్ప, కాలేరు, 24న మాచర, పడమరఖండ్రిక, నల్లూరు, 27న తాతపూడి, వెదురుమూడి, కోరుమిల్లి, 28న అంగర, కోరుమిల్లి, వెదురుమూడి, 29న నేలటూరు, కోరుమిల్లి, అంగర, 30న కపిలేశ్వరపురం, కోరుమిల్లి, వల్లూరు గ్రామాల్లో శిబిరాలను నిర్వహిస్తారన్నారు. ఆయా శిబిరాల్లో డిజిటల్ అసిస్టెంట్లు ఇనుమర్తి వీరమల్లేశ్వరరావు, అల్లక ఫణీంద్ర, కోరా దొరబాబు నూతన ఆధార్ నమోదు, మార్పులు, చేర్పులు చేస్తారని ఎంపీడీఓ రత్నకుమారి తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

రహదారి భద్రతా నియమాలు పాటించాలి



ఆటో డ్రైవర్లకు ట్రాఫిక్ రూల్స్‌ను వివరిస్తున్న సీఐ సురేష్

మండపేట: ఆటోడ్రైవర్లు రహదారి భద్రతా నియమాలను విధిగా పాటించి, ప్రయాణికులను గమ్య స్థానాలకు సురక్షితంగా తీసుకువెళ్లాలని టౌన్ సీఐ దారం సురేష్ సూచించారు. స్థానిక ఏడిద రోడ్డులోని బస్టాండ్ ఆవరణలో బుధవారం ఆయన ఆటోడ్రైవర్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ సురేష్ మాట్లాడుతూ పరిమితికి మించిన వేగంతో ఆటోలు నడపరాదన్నారు. దానివల్ల ప్రయాణికులు, డ్రైవర్ల ప్రాణాలకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందన్నారు. మద్యం తాగి వాహనం నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోరాదన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించని వారిపై కేసులు నమోదు చేసి జైలుకు పంపిస్తామని హెచ్చరించారు. సమావేశంలో టౌన్ ఏఎస్ఐ చిన్నారావు, పట్టణంలోని ఆటో యూనియన్ నాయకులు, డ్రైవర్లు పాల్గొన్నారు.

9న సైన్స్ ఎగ్జిబిషన్

రామచంద్రపురం: అంతర్జాతీయ మహిళల, బాలికల సైన్స్ దినోత్సవం సందర్భంగా, రేవతి సైన్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహిళా ఉపాధ్యాయులకు, పాఠశాల స్థాయి నుంచి పోస్ట్ గ్రాడ్యుయేట్ స్థాయి వరకు చదువు కొనే విద్యార్థినులకు ఫిబ్రవరి 9న రామచంద్రపురంలో సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహించనున్నట్లు రేవతి సైన్స్ ఫౌండేషన్ గౌరవ అధ్యక్షురాలు సి.కవిత అధ్యక్షులు కె.శ్రీకృష్ణ సాయి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పోటీలో పాల్గొన్న విజేతలకు వివిధ కేటగిరీల వారీగా నగదు బహుమతితో పాటు, పుస్తకాలు, సైన్స్ కిట్స్ అందజేయబడుతుందని, తమ వివరాలను ఈనెల 31లోపు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని తెలిపారు. పూర్తి వివరాలకు 9866130320 సంప్రదించాలని ఈ కార్యక్రమంలో పాల్గొనడానికి ఎటువంటి ప్రవేశ రుసుం లేదని పేర్కొన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు సంబంధించిన మేనేజ్‌మెంట్ అన్ని విద్యాసంస్థల విద్యార్థినులు ఈ కార్యక్రమంలో వైజ్ఞానిక దృక్పథం, శాస్త్రీయ ఆలోచనలు, సైన్స్ పట్ల అభిరుచి ఆసక్తిని పెంచేందుకు గత ఎనిమిదేళ్ల నుంచి రేవతి సైన్స్ ఫౌండేషన్ ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తుందని వారు తెలిపారు.

దోమల నివారణకు చర్యలు



డ్రైన్లలో ఆయిల్‌బాల్స్ వేయిస్తున్న ఇన్‌చార్జ్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ సత్తిరాజు

మండపేట: పట్టణంలో దోమల నివారణకు మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టారు. మున్సిపల్ కమిషనర్ టీవీ రంగారావు ఆదేశాల మేరకు ఇన్‌చార్జ్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ ముత్యాల సత్తిరాజు పట్టణంలోని 30 వార్డుల్లోనూ ఆయిల్‌బాల్స్ వేయించారు. 120 లీటర్ల ఎంఎల్ ఆయిల్‌బాల్స్ కలిపి డ్రైన్లలో వేసినట్టు సత్తిరాజు తెలిపారు. మురుగు ఎక్కువగా వున్న ప్రాంతాల్లో దోమల లార్వాను ధ్వంసం చేసేందుకు అయిల్‌బాల్స్ వేశామన్నారు. కార్యక్రమంలో పారిశుధ్య సిబ్బంది పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ

కాజులూరు: తీర్థయాత్రలకు వెళ్లి అరుణాచలంలో గుండెపోటుతో మృతి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు, గొల్లపాలెం పీఏసీఎస్ మాజీ చైర్మన్ డాక్టర్ సత్తి శ్రీరామారెడ్డి కుటుంబీకులను, గొల్లపాలెంలో అనారోగ్యంతో మృతి చెందిన స్థానిక నాయకుడు కోకా వెంకటేశ్వర్రావు (బుజ్జి) కుటుంబీలను బుధవారం రామచంద్రపురం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ పిల్లి సూర్య ప్రకాశ్ తదితర నాయకులు పరామర్శించారు. ముందుగా శ్రీరామారెడ్డి కుటుంబీకులను పరామర్శించి అరుణాచలంలో జరిగిన సంఘటనపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం అనారోగ్యంతో మృతిచెందిన కోకా వెంకటేశ్వ్రరావు (బుజ్జి) కుటుంబీకులను పరామర్శించి ఆయన భౌతికకాయానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. పార్టీ అభివృద్ధికి వారు చేసిన సేవలను సూర్యప్రకాశ్ కొనియాడారు. జెడ్పీటీసీ వనుం వెంకటసుబ్బారావు, ఎంపీటీసీ జొన్నకూటి పద్మజ, మాజీ సర్పంచ్ కొప్పుల సత్యనారాయణ, మాదిరెడ్డి చిన్ని, పృథ్వీరాజ్, పితాని సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

కంటిమీద కునుకు కరవు

- ఆదిలోనే రైతుకు హంసపాదు
- దాళ్వా పంటకు ఎలుకల బెడద
- అధిక వ్యయాలపై అన్నదాత ఆందోళన



కాజులూరులో పొలంగట్టుపై ఎలుకలు చంపడానికి పెడుతున్న పొగ

కాజులూరు: దాళ్వా సాగు తొలిదశలోనే వరిపంటపై ఎలకలు దాడి చేస్తుండటంతో వాటిని అదుపు చేయలేక రైతులు ఆందోళన చెందుతున్నారు. నియోజకవర్గంలో ప్రస్తుతం సుమారు 52 వేల ఎకరాల్లో వరిసాగు జరుగుతుండగా అధికశాతం పొలాల్లో పంట వేరునాటే దశ నుంచి దుబ్బుకట్టే దశలో ఉంది. ఈ తొలిదశలోనే పొలాల్లో ఎలక కొట్టుడు రైతులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. రసాయనిక మందులు వాడినా ఎలుకలు నిర్మూలన సాధ్యం కాకపోవడంతో పంటలను రక్షించుకునేందుకు అధిక వ్యయాలకోర్చి ఎన్నో వ్యయప్రయాసలకు గురై వాటిని మట్టుపెట్టాల్సి వస్తోందని రైతులు చెబుతున్నారు. ప్రస్తుతం ఎక్కువగా ముదరగా ఊడ్చిన, వెదజల్లిన పొలాల్లోను ఎలుకలు వరిమూనలు నాశనం చేస్తున్నాయని రైతులు అంటున్నారు. ఎలుకల నివారణకు రైతులు వరినూకలకు నూనె, రసాయన మందును తగిన మోతాదులో కలిపి పొట్లాలు కట్టి పొలాల్లోని గట్లపై ఉండే ఎలుకల బొరియలు (కన్నాల) వద్ద ఉంచేవారు. అయితే ఎలుకలు ఉధృతి అధికంగా ఉండటంతో ఈ విధానం ఫలితాలను ఇవ్వడం లేదని రైతులు చెబుతున్నారు. ప్రస్తుతం రైతులు ఎలుకల బుట్టలు ఉపయోగించడం, పొగపెట్టడం ద్వారా నివారణ చర్యలు తీసుకుంటున్నారు. బుట్టలు పెట్టే విధానంలో ఎరగా ఉంచిన ధాన్యం గింజలు తినటానికి వచ్చిన ఎలుక ప్రత్యేకంగా అమర్చిన ఎదురు కర్రల మధ్య బుట్టలో చిక్కుకుని మరణిస్తుంది. పొగపెట్టే పద్ధతిలో ఎలుకలు తిరిగే ప్రాంతాలు గుర్తించి అక్కడ కొంతమేర తవ్వి కుండలో గడ్డి ఉంచి నిప్పు పెట్టి పొగ వచ్చేలా చేసి కన్నం వద్ద ఉంచుతారు. ఆ పొగకు కన్నంలో ఉన్న ఎలుక ఊపిరాడక చనిపోతుంది. మరో విధానంలో ఎలుక ఉన్న ప్రాంతంలో లోతుగా కన్నం తవ్వి చేతితో పట్టుకుని చంపేస్తారు. ఈ విధానాల ద్వారా చంపిన ఒక్కో ఎలుకకు రూ.50 తీసుకుంటున్నారు. నియోజకవర్గ గ్రామాల్లో ఎలుకలు పట్టే వారికి డిమాండ్ పెరగడంతో ఒక్కోమారు ఎలుక పట్టుకునే ధర పెరుగుతుందని రైతులు వాపోతున్నారు. మెట్టప్రాంతాల నుంచి ఎలుకలు పట్టే వారు కొందరు రామచంద్రపురం, కాజులూరు, కె.గంగవరం మండలంలోని కొన్ని గ్రామాల్లో రైతులను కలుసుకుని ఎలుకలు చంపడానికి ఒప్పందం కుదుర్చుకుంటారు. ఎకరానికి రూ.రెండువేల నుంచి రూ.2500 చొప్పున బేరమాడుకుని ఆ పంట కాలంలో పూర్తయ్యే వరకు ఎలుకలను చంపుతున్నారు. ఎన్ని ప్రయత్నాలు చేసినా ఎలుకల నిర్మూలన పూర్తిగా సాధ్యం కాకపోవడంతో అవి దిగుబడిపై ఏ విధంగా ప్రభావితం చూపుతాయోనని రైతులు కలవరపడుతున్నారు.

పంట నాశనమవుతుంది



ఎలుకల దాడికి గురయితే వరి పంట సర్వనాశనమౌతుంది. ఎలుకలు వరి దుబ్బులను మొదలకు కొరికి పారవేస్తుండటంతో మొక్క పూర్తిగా చనిపోతుంది. ఫలితంగా ఎకరానికి సుమారు 10 బస్తాల పైబడి దిగుబడి తగ్గిపోతుంది.

– జొన్నకూటి వెంకటేశ్వరరావు, రైతు, గొల్లపాలెం

అధిక వ్యయం



వరి పంటపై ఎలుకల దాడి వలన అధిక వ్యయాలకు గురికావలసి వస్తుంది. మార్కెట్‌లో దొరికే ఖరీదైన మందులు వాడినా అవి తినడం లేదు. బుట్టలు పెట్టడం లేదా, పొగపెట్టే పద్ధతిలో ఎలుకలు పట్టించాల్సి వస్తుంది. దీనికి అధిక ధరలు చెల్లించాల్సి వస్తుంది.

– నరాల నాగేశ్వరరావు, రైతు, దుగ్గుదుర్రు

ఎస్‌బీఐ సేవలు ప్రశంసనీయం



రాయవరం ఓల్డ్ ఏజ్ హోమ్‌కు సామగ్రిని అందజేస్తున్న ఎస్‌బీఐ జోనల్ మేనేజర్ శ్రీనివాస్ తదితరులు

రాయవరం: స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) సామాజిక సేవలో పాలు పంచుకోవడం ప్రశంసనీయమని పలువురు వక్తలు పేర్కొన్నారు. రాయవరం ఓల్డ్ ఏజ్ హోమ్‌కు అవసరమైన పలు రకాల వస్తువులను ఎస్‌బీఐ బుధవారం అందజేసింది. ఈ సందర్భంగా సర్పంచ్ చంద్రమళ్ల రామకృష్ణ, బ్లడ్ అండ్ ఐ డోనర్స్ క్లబ్ చైర్మన్ వెలగల ఫణికృష్ణారెడ్డి, రాయవరం గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ వుండవిల్లి రాంబాబు, వైఎస్సార్ సీపీ నేత పడాల కమలారెడ్డి తదితరులు మాట్లాడుతూ సామాజిక సేవలో ఎస్‌బీఐ భాగస్వామ్యమవ్వడం హర్షణీయమన్నారు. ఎస్‌బీఐ రీజనల్ మేనేజర్ డి.శ్రీనివాస్ మాట్లాడుతూ ఎస్‌బీఐ సామాజిక సేవకు అత్యంత ప్రాధాన్యమిస్తుందన్నారు. అనంతరం ఓల్డ్ ఏజ్ హోమ్‌కు రూ.2 లక్షల విలువైన ఫ్రిజ్, కుక్కర్లు, వంట సామగ్రిని అందజేశారు. సమావేశంలో ఎస్‌బీఐ హెచ్‌ఆర్ పవన్, రాయవరం శాఖ మేనేజర్ ఆర్.రవికుమార్, ఎస్‌బీఐ సిబ్బంది జి.భరత్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి



పరిశుభ్రతపై సిబ్బందికి సూచనలు చేస్తున్న చైర్‌పర్సన్ దుర్గారాణి

మండపేట: పట్టణంలో పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టినట్టు మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి తెలిపారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ప్రజారోగ్య విభాగం సిబ్బందితో బుధవారం ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ దుర్గారాణి మాట్లాడుతూ పట్టణ పరిశుభ్రతపై పలు సూచనలు చేశారు. 30 వార్డుల్లోనూ చెత్త, వ్యర్థాలు లేకుండా చూడాలని ప్రజారోగ్య సిబ్బంది, శానిటేషన్ సిబ్బందికి ఆదేశించారు. పారిశుధ్య నిర్వహణలో అలసత్వం ప్రదర్శించవద్దన్నారు. ప్రతి వార్డులోనూ దోమల నివారణకు ఫాగింగ్ చేయాలన్నారు. దోమల వృద్ధిని అరికట్టేందుకు డ్రైన్లలో ఆయిల్ బాల్స్ వేయాలన్నారు. పారిశుధ్య నిర్వహణకు అవసరమయ్యే సామగ్రి అందుబాటులో ఉండేలా చూసుకోవాలని శానిటేషన్ అధికారులకు సూచించారు. పరిసరాల పరిశుభ్రతపై ప్రజలను చైతన్య పరచాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ ముత్యాల సత్తిరాజు, మేస్త్రీలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికల హామీలు బుట్టదాఖలు

మండల సమావేశంలో ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు



రాయవరం మండల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ త్రిమూర్తులు

రాయవరం: ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు బుట్టదాఖలు చేశారని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు పేర్కొన్నారు. రాయవరం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం బుధవారం ఎంపీపీ నౌడు వెంకటరమణ అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్సీ త్రిమూర్తులు మాట్లాడుతూ ఉచిత ఇసుక ఎక్కడా కానరావడం లేదన్నారు. గత ప్రభుత్వ హయాంలో రైతులకు పెట్టుబడి నిమిత్తం రైతు భరోసా అందించినట్టు గుర్తు చేశారు. ప్రస్తుత ప్రభుత్వం రైతులకు మొండి చేయి చూపిందన్నారు. ప్రతి విషయంలోనూ ప్రజలను మోసగించారన్నారు. గ్రామాల్లో ఎవరైనా బెల్టుషాపులు నిర్వహిస్తే బెల్టు తీస్తామంటూ అసెంబ్లీ సాక్షిగా ముఖ్యమంత్రి ప్రకటించారని, అయితే వాస్తవంగా పరిస్థితి క్షేత్ర స్థాయిలో పూర్తి భిన్నంగా ఉందన్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అన్ని వర్గాలను సమాన దృష్టితో చూడగా, ప్రస్తుత టీడీపీ ప్రభుత్వం పక్షపాత వైఖరిని అవలంబిస్తోందన్నారు. లొల్ల సర్పంచ్ చాట్రాతి జానకిరాం బాబు, కూర్మాపురం నీటి సంఘం అధ్యక్షుడు కొరిపెల్ల శ్రీనివాస్ మాట్లాడుతూ ఎమ్మెల్సీ త్రిమూర్తులు చేసిన ఆరోపణలపై అభ్యంతరం వ్యక్తం చేశారు. అధికారులు వారి శాఖల పనితీరును, ప్రగతిని వివరించారు. 2024–25 ఆదాయ, వ్యయ వివరాలను సమావేశంలో ప్రవేశ పెట్టగా సభ ఆమోదించింది. సమావేశంలో వైస్ ఎంపీపీ గుబ్బల సుబ్రహ్మణ్యం, తహసీల్దార్ ఐపీ శెట్టి, ఎంపీడీఓ కీర్తిస్పందన, ఎంపీటీసీలు, సర్పంచులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వరి పంటలో పోషకాలు వాడాలి



పొలం పిలుస్తోంది కార్యక్రమంలో మాట్లాడుతున్న డీడీ జ్యోతిర్మయి



కందులపాలెంలో రైతులకు యాప్‌ల గురించి వివరిస్తున్న వ్యవసాయాధికారులు

కె.గంగవరం: రైతులందరూ తప్పనిసరిగా దాళ్వా వరి సాగులో జింక్, పొటాష్ వంటి పోషకాలు వాడాలని జిల్లా వనరుల కేంద్రం డీడీ జ్యోతిర్మయి అన్నారు. మండలంలోని అముజూరు, కూళ్ల శివారు గ్రామం నరజాడ గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. మండల వ్యవసాయాధికారి బలుసు రవి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ పోషకాలు వాడకపోతే దిగుబడిలో నష్టపోతారని చెప్పారు. దీంతో పాటు రైతులు పశువుల పెంట పొలాలకు వేయడం ద్వారా సూక్ష్మపోషకాలు వేసేవారని కానీ ఇప్పుడు అవి వేయకపోవడం వల్ల వరి పంటకు నష్టం వాటిల్లితుందన్నారు. రోగ నిరోధకశక్తి గింజ బరువు కోసం పొటాష్ వాడాలని భాస్వరం, కదలిక కోసం జింక్ తప్పనిసరిగా వాడాలన్నారు. జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ రాజశేఖర్ మాట్లాడుతూ రైతులందరూ ప్రస్తుతం బొండాలు రకం వేస్తున్నందున దుబ్బు కుళ్లు వచ్చే అవకాశం ఉందని దీని నివారణ కోసం తెగులు మందులు క్రమం తప్పకుండా మొదటి పిచికారీ నుంచి మొదలు పెట్టాలన్నారు. తెగులు మందులు ఒక సారి కొట్టింది మరల కొట్టకుండా వాడడం ద్వారా పురుగుమందును ఎక్కువ రోజులు ఉపయోగించవచ్చని సూచించారు. రామచంద్రపురం ఏడీఏ రంగారావు, నీటిసంఘం చైర్మన్ యనమదల చిట్టిబాబు, స్థానిక రైతులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

పొలం పిలుస్తోంది

రామచంద్రపురం రూరల్: కందులపాలెంలో మండల వ్యవసాయ అధికారి ఎన్.సత్యప్రసాద్ ఆధ్వర్యంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. రామచంద్రపురం వ్యవసాయ సంచాలకులు ఏడీఏ రంగారావు కార్యక్రమంలో పాల్గొని దాళ్వా పంటకు సంబంధించి ఈ–పంట నమోదు రైతులందరూ తప్పనిసరిగా చేయించుకోవాలని సూచించారు. ఎరువుల యాజమాన్యం, ఎన్‌పీఎస్ఎస్ యాప్, రైతు నమోదుల కోసం అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వీఏఏ డి.నానిబాబు, గ్రామ రైతులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పశువైద్య శిబిరాలు



దంగేరులో మేకలకు టీకాలు వేస్తున్న పశువైద్యులు



వెదురుమూడిలో పశువులకు పరీక్షలు చేస్తున్న పశువైద్యాధికారి రమణమూర్తి

కె.గంగవరం: మండలంలోని దంగేరు, అముజూరు గ్రామాల్లో బుధవారం పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఉచిత పశు ఆరోగ్య శిబిరాలు నిర్వహించారు. అముజూరులో జరిగిన ఆరోగ్య శిబిరం వద్ద పామర్రు పశువైద్యాధికారి బిందు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత పాడి రైతులు పశువులకు వచ్చే వ్యాధులపై ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. క్రమం తప్పకుండా పశువులకు, మేకలకు టీకాలు వేయించుకోవాలన్నారు. అనంతరం ఈ శిబిరంలో పశువైద్యులు రెండు గ్రామాల్లో సుమారు 100 పశువులకు ఉచితంగా గర్భకోశ పరీక్షలు, చూడి పరీక్షలు నిర్వహించారు. అనంతరం పాడి రైతులకు ఉచితంగా మినరల్ మిక్చర్‌తో పాటు పలు రకాల మందులు అందించారు. దీంతో పాటు చూడి పరీక్షలు, నట్టల నివారణ మందులు అందించారు. మేకలకు ఉచితంగా టీకాలు వేశారు.

వెదురుమూడిలో పశువైద్య శిబిరం

కపిలేశ్వరపురం: మండలంలోని వెదురుమూడిలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో బుధవారం ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని ఉప సర్పంచ్ చుండ్రు అచ్యుతరామయ్య ప్రారంభించారు. శిబిరంలో 89 పాడి పశువులు, 50 గొర్రెలకు వైద్యాధికారి డాక్టర్ రమణమూర్తి వైద్యసేవలందించారు. పాడి రైతులకు ఉచితంగా మందులను అందజేశారు.

పెంతెకోస్తు మహాసభలను విజయవంతం చేయాలి



మీడియా సమేవేశంలో మాట్లాడుతున్న డేనియల్ పాల్

మండపేట: పట్టణంలో గురువారం నుంచి ఈ నెల 31 వరకూ నిర్వహించే పెంతెకోస్తు మహాసభలను విజయవంతం చేయాలని జిల్లా పాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు, తాపేశ్వరం జీసస్ క్రైస్ట్ గ్లోరీ చర్చి పాస్టర్ డాక్టర్ డేనియల్ పాల్ పిలుపునిచ్చారు. మండపేటలో బుధవారం ఆయన మీడియా సమావేశం నిర్వహించి సభల వివరాలను వెల్లడించారు. స్థానిక స్టేట్ బ్యాంక్ పక్కన ఉన్న స్థలంలో గురువారం నుంచి తొమ్మిది రోజులపాటు నిర్విరామంగా సభలు జరుగుతాయని చెప్పారు. ప్రతిరోజూ ఉదయం 10 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకూ ప్రత్యేక ప్రార్థనలు, క్రీస్తు బోధనలు, క్రీస్తు గీతాలు వంటి కార్యక్రమాలు ఉంటాయన్నారు. ప్రత్యేక సందేశాలు ఇచ్చేందుకు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి 25 మంది దైవజనులు హాజరుకానున్నట్టు తెలిపారు. ఈ మేరకు ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. ప్రముఖ ప్రసంగీకులు అనిల్‌కుమార్ ఈ నెల 31న రాత్రి ప్రత్యేక వర్తమానాన్ని అందిస్తారని వివరించారు. మండపేట, పరిసర ప్రాంతాల నుంచి క్రైస్తవులు హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో పాస్టర్స్ అసోసియేషన్ జిల్లా నాయకులు ఉండ్రాజవరపు సుందర విజయం, జీఎస్‌వీ మణి కుమార్, ఎం.డేవిడ్‌రాజు, కె.ఎలీషారాజు, వి.శ్యామ్‌మహిమ కుమార్, ఎం.ఏసురత్నం, ధూళి జయరాజు, గోశాల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కిశోరీ వికాసంపై అవగాహన

రామచంద్రపురం: స్థానిక మున్సిపల్ కౌన్సిల్ సమావేశ మందిరంలో బుధవారం జిల్లా మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ, ఐసీడీఎస్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో సీడీపీవో వీవీ వరాహలక్ష్మి అధ్యక్షతన వార్డు స్థాయి అధికారులకు కిశోరి వికాసంపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మున్సిపల్ చైర్మన్ గాదంశెట్టి శ్రీదేవి పాల్గొని మాట్లడుతూ బాలల పరిరక్షణ కోసం ఎంతగానో కృషి చేస్తున్నామన్నారు. కిశోరీ వికాసం ద్వారా వార్డు స్థాయిలో బాలలతో గ్రూపులు ఏర్పాటు చేసి వారికి బాలల చట్టాలు పరిరక్షణ అంశాలు, వ్యక్తి గత పరిశుభ్రత పై అవగాహన కల్పిస్తామన్నారు. మున్సిపల్ కమిషనర్ వీఐపీఐ నాయుడు మాట్లాడుతూ నేటి సమాజంలో బాలలపై వివక్ష తీవ్ర రూపం దాల్చిందని బాల్యవివాహాలు, బాలలపై వేధింపులు ఎక్కువవుతున్నాయన్నారు. జిల్లా చైల్డ్ హెల్ప్‌లైన్ 1098 కోఆర్డినేటర్ బి.శ్రీనివాసరావు మాట్లాడుతూ కిశోరీ వికాసంపై, బాల్య వివాహాలు, పోక్సో చట్టంపై పవర్ పాయింట్ ప్రెజెంటేషన్‌తో అవగాహన కల్పించచారు. అనంతరం పోస్టర్‌ను ఆవిష్కరించారు. సచివాలయం వెల్ఫేర్ కార్యదర్శులు, ఏఎన్ఎంలు, మహిళా సంరక్షణ కార్యదర్శులు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మార్కెట్ రోడ్డు ఆక్రమణల తొలగింపు

రామచంద్రపురం రూరల్: మండలంలోని ద్రాక్షారామలో మార్కెట్ రోడ్డు ఆక్రమణలను ద్రాక్షారామ పంచాయతీ ఆధ్వర్యంలో బుధవారం తొలగించారు. ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వర స్వామి వారి రథం వెళ్లే మార్గం (మాఢ వీధి) ఇరుకుగా మారి స్వామి వారి కల్యాణం సమయంలో రథం వెళ్లేందుకు ఇబ్బంది పడుతున్న దృష్ట్యా, ఇతర సదుపాయాలు కల్పించేందుకు ఆక్రమణలను తొలగించారు. షాపులను, షెడ్లను నిర్మించి పంచాయతీకి ఆదాయం పెంచే విధంగా ఈ చర్యలు చేపట్టినట్లు గ్రామ సర్పంచ్ కొత్తపల్లి అరుణ ఒక ప్రకటనలో తెలియజేశారు. భీమేశ్వరాలయం ఎదురుగా రంగోళి హోటల్ నుంచి యానం సెంటర్ వరకు మాఢవీధిని 21 అడుగుల వెడల్పు ఉండేలా ఆక్రమణలు తొలగించినట్లు పంచాయతీ కార్యదర్శి పెట్టా సత్యనారాయణ తెలిపారు. కార్యక్రమంలో సర్వేయర్లు సాయిరాం, సోమశేఖర్, వీఆర్‌ఓలు పరంజ్యోతి, సురేష్ పాల్గొన్నారు. ద్రాక్షారామ ఎస్సై ఎం.లక్ష్మణ్ తన సిబ్బందితో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా బందోబస్తు నిర్వహించారు.



ద్రాక్షారామలో మార్కెట్ రోడ్డు ఆక్రమణలు తొలగిస్తున్న పంచాయతీ సిబ్బంది

కుష్ఠు వ్యాధి లక్షణాలపై అవగాహన అవసరం



అచ్యుతాపురంలో అవగాహన కల్పిస్తున్న ఆరోగ్య సిబ్బంది



వెల్లలో గ్రామస్తులను పరీక్షిస్తున్న ప్రశాంతి

కపిలేశ్వరపురం: ప్రతిఒక్కరూ కుష్ఠు వ్యాధి లక్షణాలపై అవగాహనతో మెలగాలని అచ్యుతాపురం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ విజయ దీపిక అన్నారు. మండల పరిధిలోని గ్రామాల్లో బుధవారం ఎంపీహెచ్ఈఓ గోపాలకృష్ణ, వైద్య ఆరోగ్య కార్యకర్తలు కృష్ఠు వ్యాధి లక్షణాలున్న వారిని గుర్తించే నిమిత్తం సర్వే చేపట్టారు. అచ్యుతాపురంలో సర్వేను సర్పంచ్ రెడ్డి సుజాత పరిశీలించారు. ఈ సందర్భంగా డాక్టర్ విజయ దీపిక మాట్లాడుతూ చర్మంపై స్పర్శలేని మచ్చలు, మందమైన మెరిసే జిడ్డుగల చర్మం చెవులు, వీపు, చెస్ట్‌పై నొప్పిలేని బొడిపెలు, కనుబొమ్మలు, కనురెప్పలు, వెంట్రుకలు రాలిపోవడం, కాళ్లు, చేతుల తిమ్మిర్లు, అరిచేతులు, అరికాళ్లు స్పర్శ కోల్పోవడం, కాలివేళ్లు, చేతివేళ్లు వంకర్లు తిరిగి వైకల్య స్థితికి వెళ్తుండటమనే లక్షణాలు ద్వారా కుష్ఠు వ్యాధిని గుర్తించవచ్చన్నారు. కుష్ఠువ్యాధిపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ మాజీ చైర్మన్ రెడ్డిప్రసాద్, సచివాలయ ఉద్యోగులు పి.ఈశ్వరి, దుర్గారావు, డీపీఎంఓ పి.వెంకటేశ్వరరావు, ఆరోగ్య కార్యకర్తలు ఎస్.రవీంద్రకుమార్, కె.పుష్పావతి, టి.శిరీష, బి.నిర్మల తదతరులు పాల్గొన్నారు.

వెల్లలో లెప్రసీ డిటెక్షన్ క్యాంపెయిన్

రామచంద్రపురం రూరల్: మండలంలోని వెల్ల గ్రామంలో పీహెచ్‌సీ వైద్యుల ఆధ్వర్యంలో బుధవారం జాతీయ కుష్ఠు నిర్మూలనలో భాగంగా లెప్రసీ డిటెక్షన్ క్యాంపెయిన్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డివిజనల్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎస్.ప్రశాంతి పాల్గొన్నారు. పీహెచ్‌సీ వైద్యులు, ఏఎన్ఎంలు, ఆశాలు నిర్వహిస్తున్న సర్వేను పరిశీలించారు. చర్మంపై రాగి రంగు మచ్చలు, నరాల నొప్పి, కాళ్లు చేతుల్లో కండరాల బలహీనత, చేతులు, పాదాలు తిమ్మిరిగా ఉండటం, కళ్లు పూర్తిగా మూసుకోలేకపోవడం వంటి లక్షణాలు ఉన్నవారు వెంటనే ఆరోగ్య సిబ్బందిని సంప్రదించాలని సూచించారు. దీని ద్వారా అంగవైకల్యాన్ని నివారించవచ్చని తెలిపారు. రామచంద్రపురం డివిజన్ పరిధిలోని 17 పీహెచ్‌సీలు, యూపీహెచ్‌సీల పరిధిలో ప్రస్తుతం 20 మందిని గుర్తించి వారికి చికిత్స అందిస్తున్నట్లు విలేకరులకు తెలిపారు. అనంతరం వెల్ల పీహెచ్‌సీని ఆమె తనిఖీ చేశారు. కార్యక్రమంలో వెల్ల పీహెచ్‌సీ వైద్యాధికారి లక్ష్మీప్రసన్న, డివిజనల్ సూపర్‌వైజర్ జి.కమల్‌శేషు, సూపర్‌వైజర్లు కె.శ్రీనివాస్, డి.రాజేశ్వరి, ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.